ఈనాడు
ప్రకాశం
గురువారం 10 అక్టోబరు 2024

అక్షరానికి మూలం.. సరస్వతీ నమస్తుభ్యం



వాసవీ.. ముత్యాల చీర సేలం నుంచి తెస్తిమి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ప్రసిద్ధిగాంచిన త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరీ దేవి ఆలయంలో అమ్మవారు ఏడో రోజైన బుధవారం గజ వాహనంపై కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని పలుచోట్ల అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. బేస్తవారపేటలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూల విరాట్‌ను సేలం నుంచి తెచ్చిన ముత్యాల చీరతో అలంకరించారు.





వర ప్రదాయిని.. కాళరాత్రి రూపిణి:

– న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం, బేస్తవారపేట, ఒంగోలు



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా.. చిత్రంలో ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ

15 నుంచి అందుబాటులో ఇసుక


- పొరుగు జిల్లాల నుంచి సరఫరా
- సొంత ఇళ్లకు 285 చోట్ల అనుమతులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇసుకను పారదర్శకంగా సరఫరా చేయడంతో పాటు, అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఇసుక సరఫరా, మద్యం విధానాలపై ఒంగోలు ప్రకాశం భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఏఆర్.దామోదర్‌తో కలిసి ఆమె మాట్లాడారు. జిల్లాకు అవసరమైన ఇసుకను కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల నుంచి ఇకపై సరఫరా చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 285 ప్రదేశాలను గుర్తించామని, ఆయా చోట్ల నుంచి సమీపంలోని గ్రామస్థులు సొంత గృహ నిర్మాణాలకు తెచ్చుకోవచ్చని సూచించారు. పట్టా భూముల్లో తవ్వకాలకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. నెల్లూరు, కడప జిల్లాలోని స్టాక్ పాయింట్లు, రీచ్‌లు ఈ నెల 15 నుంచి జిల్లాకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేసే వారిపై ఇప్పటివరకు 32 కేసులు నమోదు చేసి రూ.8.78 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు.

14న మద్యం దుకాణాలకు లాటరీ...: మద్యం విధానంలో భాగంగా జిల్లాలోని 171 దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనల మేరకు ఒక వ్యక్తి ఎన్నింటికైనా దరఖాస్తు చేయవచ్చని, లైసెన్స్‌లు పొందవచ్చన్నారు. గీత కార్మికులకు 17 దుకాణాలు కేటాయించినట్లు చెప్పారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, 14న లాటరీ తీయనున్నట్లు వివరించారు. సమావేశంలో జేసీ రోణంకి గోపాలకృష్ణ, మార్కాపురం ఉప కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఏఎస్పీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన!

- కొత్త రేషన్ కార్డులకు సన్నాహాలు
- 23 మండలాల్లో దుకాణాల పెంపు
- విస్తృత కసరత్తు చేస్తున్న అధికారులు



ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే:

పేదలకు బియ్యం నుంచి నిత్యావసర సరకుల పంపిణీ వరకు ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ఎంతో కీలకం. వైకాపా అధికారంలో ఉన్న గడిచిన అయిదేళ్లు అస్తవ్యస్తం చేసింది. గుమ్మం ముంగిటే బియ్యమంటూ సుమారు రూ.25 కోట్లతో ఎండీయూ వాహనాలు కొనుగోలు చేసింది. అవేమీ ఇంటింటికీ వెళ్లకపోగా.. అసలు ఎప్పుడు వస్తాయో తెలియక చాలా మంది లబ్ధిదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన దిశగా ఇప్పుడు అడుగులు వేస్తోంది. అందులో భాగంగా రేషన్ దుకాణాల పెంపుతో పాటు, కొత్తగా బియ్యం కార్డులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది.

వ్యత్యాసం.. దూరాభారం తగ్గింపు...

నగరంలోని ఒక్కో రేషన్ దుకాణం పరిధిలో 600 - 650; పట్టణాల్లో 500 - 550; గ్రామాల్లో 400కు తక్కువ కాకుండా కార్డుల విభజన చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. జిల్లాలో కొన్నిచోట్ల 600 - 1,500 వరకు కార్డులున్నాయి. పెద్దారవీడులోని ఓ దుకాణంలో అత్యధికంగా 1,526; ఒంగోలులో 1,453, దర్శిలో 1,441 కార్డులు ఉన్నాయి. ఈ పరిస్థితులతో కొన్ని దుకాణాలపై భారం పడితే.. మరికొన్నింటిలో తక్కువ ఉన్నాయి. సదరు డీలర్లకు చెల్లించే కమీషన్‌లోనూ వ్యత్యాసం వస్తోంది. కొత్త కార్డులు మంజూరు చేస్తే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. దీంతో ఒక్కో దుకాణంలో సరాసరిన 500 కార్డులు ఉంచడంతో పాటు, ప్రజలకు దూరాభారం తగ్గించేలా సర్దుబాటు చేసి, కొత్తవి ఏర్పాటు చేయనున్నారు. తద్వారా 23 మండలాల్లో కొత్తగా 82 దుకాణాల ఏర్పాటుకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.


కొత్త కార్డులతో అర్హులకు లబ్ధి...

ప్రస్తుతం జిల్లాలో సుమారు 8 లక్షల కుటుంబాలుండగా; 6.70 లక్షల కుటుంబాలకు బియ్యం కార్డులు ఉన్నాయి. గత ప్రభుత్వం హయాంలో అమలు చేసిన ఆరంచెల విధానంతో పాటు, సాంకేతిక సమస్యలు రేషన్ కార్డుల మంజూరుకు అడ్డంకిగా మారాయి. దీంతో అర్హులైన పేదలు పింఛన్లతో పాటు, ఇతర సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలో అర్హులైన పేదలకు కార్డులు జారీ చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించనుంది. ఓ కుటుంబంలో తల్లిదండ్రులతో పాటు, వివాహం అయ్యాక కొడుకు, కుమార్తె కూడా సదరు కార్డులోనే ఉండటం.. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తే పెద్దలు పింఛన్ పొందేందుకు అనర్హులయ్యారు. తాజాగా చేపట్టిన కుటుంబ సభ్యుల మార్పులతో అర్హులు నిత్యావసర సరకులతో పాటు సంక్షేమ పథకాల లబ్ధి పొందనున్నారు.



మద్యం దుకాణాలకు 2,140 దరఖాస్తులు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. బుధవారం రాత్రికి జిల్లాలోని 171 దుకాణాలకు 2,140 వరకు దాఖలయ్యాయి. వాస్తవానికి బుధవారం సాయంత్రం తుది గడువు. అయితే పలుచోట్ల అధికార పార్టీ నాయకులు, సిండికేట్ల అదిలింపులు, బెదిరింపులతో దరఖాస్తుల దాఖలులో ఎక్సైజ్ శాఖ ఊహించిన స్థాయిలో స్పందన లభించలేదు. ఈ పరిస్థితుల్లో దాఖలుకు ఈ నెల 11వ తేదీ వరకు గడువు పెంచారు. దీంతో ఈ రెండు రోజుల్లో ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు దాఖలైన దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ. 42.80 కోట్ల ఆదాయం సమకూరింది.



బీఎస్‌ఎన్‌ఎల్‌కు కొత్త సొబగులు

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే:

టెలికామ్ మార్కెట్‌లోని తీవ్ర పోటీని తట్టుకుని నిలిచేలా ప్రభుత్వ రంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్‌ఎన్‌ఎల్) ఇప్పుడు కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. నెట్‌వర్క్ సరిగా ఉండదనే విమర్శలకు పాతరేస్తూ ప్రైవేట్ రంగ సంస్థలకు పోటీగా ఆ సంస్థ నూతన సొబగులు అద్దుకుంటోంది. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. అందుబాటులోని వనరులను మెరుగు పర్చుకుంటూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా 4జీ సేవలను వినియోగదారులకు అందించేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ఇందుకుగాను టాటా సంస్థతో కలిసి పనిచేసేలా ఒప్పందం చేసుకుంది. నెట్‌వర్క్, సాంకేతికత మరింత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మార్కెట్‌లోని ఇతర ప్రైవేట్ నెట్‌వర్క్‌లతో పోటీపడేలా తీర్చిదిద్దుతోంది. దీంతో తక్కువ సమయంలోనే వినియోగదారులు బీఎస్‌ఎన్‌ఎల్ వైపు ఆకర్షితులవుతున్నారు.

ఆర్టీసీకి 105 బస్సులు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, డీపీటీవో సుధాకర్.. చిత్రంలో మేయర్ సుజాత, జనసేన నేత రియాజ్

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ జిల్లా రీజియన్ పరిధిలోని అయిదు డిపోలకు కొత్తగా 105 బస్సులొచ్చాయి. వీటిలో 25 అద్దెవి, మిగిలిన 80 ఆర్టీసీవి ఉన్నాయి. ఒంగోలు డిపోనకు కేటాయించిన రెండు స్టార్‌లైన్ నాన్ ఏసీ, రెండు ఇంద్ర ఏసీ బస్సులను డీపీటీవో బి.సుధాకర్‌తో కలిసి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. జిల్లా రీజియన్‌కు కొత్తగా బస్సులు రావడం మంచి పరిణామమని అన్నారు. ప్రయాణికులు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డిపో మేనేజర్ శ్రీనివాసులు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఆర్టీసీ సంఘాల నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలికి రైలొచ్చింది



నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణ పనులు ప్రస్తుతం పొదిలి మండలంలో కొంతమేర పూర్తయ్యాయి. దీంతో రెండు ఇంజిన్లు, కొన్ని బోగీలతో కూడిన రైలును అధికారులు బుచ్చన్నపాలెం, కాటూరివారిపాలెం, రాజుపాలెం మీదుగా బుధవారం ప్రయోగాత్మకంగా నడిపారు. పొదిలి ప్రాంతానికి మొదటిసారిగా రైలు రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. పలువురు చరవాణులతో ఫొటోలు దిగి సంతోషం వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, పొదిలి

అర్ధరాత్రి.. ద్విచక్ర వాహనంపై ఎస్పీ

- ఒంగోలు వీధుల్లో గస్తీ పర్యవేక్షణ
- రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహణ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: పుట్టినరోజు వేడుకల పేరుతో ఒంగోలు నగరం నడిబొడ్డునున్న పాత మార్కెట్ ప్రాంతంలో ఓ రౌడీషీటర్ సోమవారం అర్ధరాత్రి తన అనుచరులతో అలజడి సృష్టించాడు. మద్యం మత్తులో నానా రభస చేస్తూ అటుగా వచ్చిన ఆటో డ్రైవర్‌తో అకారణంగా గొడవ పెట్టుకుని విచక్షణారహితంగా కొట్టారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తులు అర్ధరాత్రి వేళ బహిరంగ ప్రదేశంలో మందు పార్టీ చేసుకుంటూ గోల చేస్తున్నా పోలీసు గస్తీ బృందాలు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించిన జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్ రంగంలోకి దిగారు. తానే స్వయంగా మంగళవారం అర్ధరాత్రి ఒంగోలు నగరంలో విస్తృతంగా పర్యటించారు. ద్విచక్ర వాహనంపై తిరుగుతూ రాత్రివేళల్లో నగరంలోని పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. క్షేత్రస్థాయి అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొద్ది గంటలపాటు ప్రధాన రహదారులు, వీధుల్లో పర్యటించారు. రాత్రి గస్తీ విధులను పర్యవేక్షించారు. ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన రౌడీషీటర్ కొత్త హరీష్, అతని అనుచరులను జిల్లా పోలీసు కార్యాలయానికి రప్పించి తమదైన శైలిలో ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

ఆ కార్యాలయానికి డబ్బు జబ్బు

- సొమ్ములు ఇవ్వకుంటే సాకులు
- కాసులిస్తే నిషేధ జాబితాల్లో ఉన్నా రిజిస్ట్రేషన్లు

అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి డబ్బు జబ్బు పట్టుకుంది. ఇక్కడ నిత్యం పదుల సంఖ్యలో భూ క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్‌లు సాగుతుంటాయి. కాసులిస్తే అన్ని పనులు సజావుగా నడుస్తాయి. లేకుంటే సాకులు చూపుతూ నిలిపేస్తారు. వైకాపా ప్రభుత్వం తెచ్చిన ఎనీ వేర్ విధానాన్ని ఇక్కడి ఉద్యోగులు కొందరు తమకు అనుకూలంగా మలచుకున్నారు. ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఈ విషయంలో నిన్నటి వరకు ఇక్కడ పనిచేసిన రిజిస్ట్రార్ ఓ అడుగు ముందున్నారు. – న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు



అలియాస్ ఉంటే అంతే సంగతులు...: వివాహం అనంతరం మహిళల ఇళ్ల పేర్లు మారడం సాధారణం. గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీలకు ఆధార్ కార్డులో భర్త పేరు, అతని ఇంటి పేరు నమోదు చేయించుకుంటారు. విద్యావంతులు, ఉద్యోగినులు తమ విద్యా ధ్రువపత్రాలకు అనుగుణంగా తండ్రి ఇంటి పేరు నమోదు చేయించుకుంటారు. ఈ విషయం అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే కొందరికి కాసులు కురిపిస్తోంది. వారసత్వంగా వచ్చిన భూమిని రికార్డుల్లో మార్చేందుకు ఇంటి పేరును సాకుగా చూపి సొమ్ము చేసుకుంటున్నారు. రికార్డుల్లో ఉన్న వాటికి అలియాస్ అంటూ అదనపు పేర్లు ఉన్నా అదే పరిస్థితి.

వర్గీకరించి ఇష్టారీతిన వసూళ్లు...

నిన్నటి వరకు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన అధికారి వసూళ్లకు ఓ ప్రైవేట్ వ్యక్తిని ఏకంగా నియమించుకున్నారు. ఇదే కార్యాలయంలో గత ఏడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి సహాయ సహకారాలతో ప్రతి పనికీ ఓ ధర నిర్ణయించి అందిన కాడికి దండుకున్నారు. ఎనీ వేర్ విధానాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు చేశారనే విమర్శలున్నాయి. ఒంగోలు నగరంలోని అయిదు స్థలాలకు ఇక్కడే రిజిస్ట్రేషన్ చేయడం అందుకు నిదర్శనం. నిషేధిత జాబితాలో ఉన్న స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయకూడదు. ఇక్కడ మాత్రం సదరు భూములకూ సబ్ డివిజన్ చేసి రిజిస్ట్రేషన్ చేశారు. ఉప్పుగుండూరులోని సర్వే నంబర్ 466 22ఏ నిషేధిత జాబితాలో ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది అసైన్డ్ భూమి. అయినప్పటికీ 466/1గా వర్గీకరించి చూపుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. కార్యాలయంలోని అక్రమాలపై పలువురు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అంతర్గత విచారణ సాగుతున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ఇక్కడ పనిచేసే సబ్ రిజిస్ట్రార్‌ను పొరుగు జిల్లా నెల్లూరుకు బదిలీ చేయడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కార్యాలయాన్ని ప్రక్షాళన చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గృహ నిర్మాణాల పురోగతిపై దృష్టి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గృహ నిర్మాణాల పురోగతిపై దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, మెప్మా పీడీ రవికుమార్, డీఆర్డీఏ పీడీ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

544డీ రోడ్డు విస్తరణ నివేదిక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బుగ్గ-కైప-గిద్దలూరు సెక్షన్ 544డీ రోడ్డు విస్తరణ పనుల ప్రాజెక్ట్ నివేదికను సమగ్రంగా రూపొందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ జిల్లా పరిధిలో 24.02 కి.మీ ఉందని వివరించారు. రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి సదరు అధికారులు సంయుక్త పరిశీలన చేసి నివేదిక అందజేయాలని సూచించారు. సమావేశంలో ఉప కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో శ్రీలత, జాతీయ రహదారి పీడీ పద్మ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ దేవానందం, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇటు చదువులు.. అటు మౌలిక వసతులు



▶ కూరగాయల మార్కెట్ నిర్మాణం..అభాగ్యులకు అన్నదానం ▶ రూ.కోట్లతో రోటరీ సేవలు ▶ మరింత విస్తరణకు ఏర్పాట్లు

చదువులతో పాటు మౌలిక వసతుల కల్పనకు రోటరీ సంస్థ రూ.కోట్లు వెచ్చిస్తోంది. గెలాక్సీపురి పరిసర ప్రాంతాల్లో గత కొన్నేళ్లుగా చేపట్టిన సేవా కార్యక్రమాలతో విద్యార్థులు..వ్యాపారులు..పేదలకు ఎంతో సాంత్వన చేకూరుస్తోంది. రూ.రెండు కోట్లతో మహాప్రస్థానం మొదలు..నీటి శుద్ధి కేంద్రాల వరకూ ఎన్నింటినో తీర్చిదిద్దగా..పేదలకు నిత్యాన్నదానం అందిస్తోంది. తాజాగా వీటిని మరింతగా విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.



పేదలకు భోజనాలు అందిస్తున్న సురేష్ కుమార్, రోటరీ ప్రతినిధులు

న్యూస్‌టుడే, చీమకుర్తి :

చీమకుర్తి రోటరీ క్లబ్ గత కొన్నేళ్లుగా గెలాక్సీపురిలో రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. సుమారు రూ.20 లక్షలు వెచ్చించి స్థానిక పిడతలపూడి రహదారిలో కూరగాయల మార్కెట్ సముదాయాన్ని నిర్మించింది. ఇది ఇటు ప్రజలకు, రైతులకు ఎంతో ప్రయోజనకారిగా ఉంటుంది. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ప్రయాణికులు సేద తీరేందుకు స్థానిక బస్టాండ్ కూడలిలో రూ.లక్షలు వెచ్చించి షెల్టర్‌ను సంస్థ ప్రతినిధులు పూర్తిచేశారు.



పిడతలపూడి రోడ్డులో నిర్మించిన కూరగాయల మార్కెట్

నీటిశుద్ధి యంత్రం ఏర్పాటుతో..

విద్యార్థుల సౌకర్యార్థం రోటరీ సంస్థ ప్రతినిధులు వివిధ వసతులు సమకూర్చారు. గాడిపర్తివారిపాలెం ఉన్నత పాఠశాలలో శుద్ధ జల యంత్రాన్ని నెలకొల్పారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సైకిల్ స్టాండ్‌ను ఏర్పాటు చేసింది. విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు వచ్చిన వారికి ఇవి ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ఇవేకాక రోటరీ సాయం, దాతల తోడ్పాటుతో సమకూరిన రూ.2 కోట్లతో మహాప్రస్థానాన్ని సుందరమైన ఉద్యానవనంలా తీర్చిదిద్దారు. గతంలో శ్మశానంలోకి వెళ్లాలంటేనే భయపడే స్థానికులు..నేడు ఉదయం నడకకు కూడా అందులోకి వెళ్తున్నారు. రకరకాల పూలమొక్కలను ఏర్పాటు చేసి ఆహ్లాదంగా తీర్చిదిద్దారు.

నిరుపేదల కడుపు నింపుతూ..

తోడూ.. నీడా కరవైన వృద్ధులు, అభాగ్యులకు గత మూడేళ్లుగా అన్నదానం చేస్తున్నారు. దీన్ని మరింతగా విస్తరిస్తున్నారు. ప్రతి రోజూ పట్టణంలో ఎలాంటి అండ లేని వారికి కడుపునిండా భోజనం పెడుతున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట లోపే భోజన పొట్లాలను సిద్ధం చేయించి ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ వృద్ధులు, ఎలాంటి ఆసరా లేని వారికి అందజేస్తున్నారు. అయిదేళ్ల కిందట చీమకుర్తి రోటరీక్లబ్ అధ్యక్షుడిగా సురేష్ కుమార్ పనిచేశారు. ఆ సమయంలో ఆయన స్థానిక బస్‌షెల్టర్‌లో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు నీటి శీతలీకరణ యంత్రం ఏర్పాటుచేశారు. ఇది ఏడాది పొడవునా తాగు నీరు అందిస్తూ నిత్యం వందలాదిమందికి ఉపకరిస్తోంది.

మాజీ ఎంపీ పార్వతమ్మకు నివాళి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ పెద్ద కర్మ సందర్భంగా నెల్లూరులోని నివాసంలో గురువారం ఆమె చిత్రపటానికి పలు రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, కరణం బలరామకృష్ణమూర్తి, కె.ఆదెన్న తదితరులు అంజలి ఘటించారు.



నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, చిత్రంలో ఎంపీ మాగుంట తదితరులు

జూనియర్ సహాయకుడిపై వేటు

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో కొందరు అక్రమాలకు తెర లేపారు. డబ్బులిస్తేనే ఉత్తర్వులు అందజేస్తామంటూ వసూళ్లకు బరి తెగించారు. ఈ విషయాన్ని తెలుపుతూ 'నగదు ఇవ్వు.. లేఖ తీసుకెళ్లు' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించి విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయంలో సోమవారం విచారణ చేపట్టారు. పూర్వ డీపీవో ఉషారాణి, పూర్వ ఏవో శివప్రసాద్, కార్యాలయ ఉద్యోగి కిశోర్‌తో పాటు, పూర్వ ఉద్యోగి సాయి నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్‌కు నివేదిక అందజేసినట్లు సమాచారం. డీపీవో కార్యాలయంలో గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల బదిలీల దస్త్రాన్ని ఆ కార్యాలయ జూనియర్ సహాయకుడు కిశోర్ నడిపినట్లు గుర్తించారు. అతన్ని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రామతీర్థం నీటి విడుదల



ఓబీసీలో సాగర్ పరవళ్లు

చీమకుర్తి, న్యూస్‌టుడే: రామతీర్థం జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. బుధవారం 220 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, క్రమంగా పరిమాణం పెంచుతూ గురువారం 350 క్యూసెక్కులను కిందికి పంపనున్నారు. ఇవి ఒంగోలులోని రెండు వేసవి నీటి నిల్వ చెరువులకు, చీమకుర్తి, అగ్రహారం, మంచికలపాడు ఈతముక్కల మేజర్ కాలువలకు పరవళ్లు తొక్కుతున్నాయి. గత నెల చివరి వారంలో వర్షాల నేపథ్యంలో రామతీర్థం నుంచి నీటి విడుదలను నిలిపివేశారు. అయితే వివిధ మేజర్ కాలువల కింద సాగుచేసిన వరి ఎండిపోతోందని రైతులు నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆమేరకు బుధవారం నుంచి మళ్లీ దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నీటిమట్టం 82.07 మీటర్లుగా ఉంది. ఓబీసీ ద్వారా 280 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దిగువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇందులో 100 క్యూసెక్కులు ఒంగోలులోని రెండు వేసవి నీటి నిల్వ చెరువులకు చేరుతోంది. మిగిలిన నీటిని చీమకుర్తి, అగ్రహారం, మంచికలపాడు, ఈతముక్కల తదితర మేజర్ కాలువలకు విడుదల చేశారు. ఈ నీటిని రైతులు, వరి తదితర పంటలకు వినియోగించుకుంటున్నారు.

విశ్రాంత ఉద్యోగుల ధర్నా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పింఛన్‌దారుల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శేషయ్య మాట్లాడుతూ, పింఛన్‌దారులకు ఇవ్వాల్సిన పీఆర్సీ డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 8వ పీఆర్సీ కమిషన్ వెంటనే ఏర్పాటుచేసి ఐఆర్ 30 శాతం ప్రకటించాలని కోరారు. వేతన సవరణ ప్రతి అయిదేళ్లకు ఒకసారి చేయడంతో పాటు, పెన్షన్ ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. సంఘం కార్యదర్శి సీహెచ్.రాంబాబు మాట్లాడుతూ, ఈపీఎస్ పెన్షన్‌దారులు అందరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని కోరారు. ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.పేరయ్య, రవికుమార్, జి.నరసయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకేయూలో పీజీ ప్రవేశాలకు అవకాశం

ఒంగోలు నగరం: నగరంలోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో పీజీ స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ జి.సోమశేఖర తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను ఈ నెల 15 నుంచి స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తామన్నారు. ఒరిజనల్ ధ్రువపత్రాలతో 15 నుంచి నేరుగా హాజరుకావాలన్నారు. ఎంఏ హిస్టరీ, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ సోషల్ వర్క్, ఎంకాం, ఎమ్మెస్సీ మేథమాటిక్స్, స్టాటిస్టిక్స్, ఆక్వాకల్చర్, కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఎడ్, బీపీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించామన్నారు.

కుమార్తె పెళ్లికి తెచ్చిన రూ.3 లక్షల చోరీ

▶ తల్లడిల్లిన పేద రైతు



పగులగొట్టిన ఇనుప బీరువా

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా తర్వాత తమ స్తోమతకు తగ్గట్టు పెళ్లి చేద్దామని తలచి తెచ్చిన నగదు దొంగల పాలవ్వడంతో ఆ పేద రైతు తల్లడిల్లారు. ఈ సంఘటన గోపాలపల్లెలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుని వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వీరారెడ్డి వాసుదేవ రెడ్డి, కుమార్తె వివాహం కోసం తీసుకొచ్చిన రూ. 3 లక్షల నగదును ఇంట్లో ఉంచారు. బుధవారం తెల్లవారుజామున ఇంటి ఆరుబయట కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సంగతి గమనించిన దుండగులు వెనుక గేటుకు ఉన్న తాళం తొలగించి లోనికి ప్రవేశించారు. ఇనుప బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.మూడు లక్షల నగదు తీసుకుని ఉడాయించారు. ఉదయం నిద్రలేచిన వాసుదేవ రెడ్డి భార్య రాధ ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించి భర్తకు తెలిపారు. ఈ మేరకు బాధితులు సమాచారమివ్వగా స్థానిక ఎస్సై వెంకటేశ్వరనాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మార్కాపురం నుంచి క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొండపేటలో పట్టపగలే..

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు నగర పంచాయతీ కొండపేటలో బుధవారం ఉదయం పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండపేటకు చెందిన పాముల నరసింహులు, అతని తమ్ముడు చిన్న నరసింహులు తమ తమ ఇళ్లకు తాళం వేసి కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం వేళ దుండగులెవ్వరో నరసింహులు ఇంట్లో ఉంచిన రూ.50వేల నగదు, 3 జతల బంగారు కమ్మలు, చిన్న నరసింహులు ఇంట్లోని బంగారు ఉంగరాన్ని దొంగిలించారు. బాధితులు గిద్దలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం సాయంత్రం మార్కాపురం క్లూస్ టీమ్ సిబ్బంది చోరీకి గురైన గృహాల్లో వేలి ముద్రలు సేకరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కేజీ రూ.90/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 123, రిటైల్ లైవ్ - 145, విత్ స్కిన్ - 210, విత్ స్కిన్‌లెస్ - 239



దాసు(పాత చిత్రం)

గుండెపోటుతో తహసీల్దార్ మృతి

అర్థవీడు, న్యూస్‌టుడే: అర్థవీడు తహసీల్దార్ కే.దాసు(55) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. అర్థవీడు కార్యాలయానికి విధులకు వెళ్లేందుకు సిద్ధమైన దాసు కంభంలోని నివాస గృహంలో అస్వస్థతకు గురయ్యారు. వైద్యసేవల కోసం తన కార్లో నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యలో గుండెపోటుతో వినుకొండ సమీపంలో మృతి చెందారు. గతంలో పుల్లలచెరువు, యర్రగొండపాలెం పట్టణాల్లో విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో ఇటీవల అర్థవీడు తహసీల్దార్‌గా వచ్చారు. దాసు మృతి పై రెవెన్యూ అధికారులు, మండల నాయకులు, కార్యాలయ సిబ్బంది సంతాపం తెలియజేశారు.


బేస్తవారపేటలో..


పుల్లలచెరువులో...


పొదిలమ్మ


కంభం : కోట సత్యమాంబదేవి

సరస్వతీ.. నమోస్తుతే

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏడో రోజు బుధవారం అమ్మవారి జన్మనక్షత్రం అయిన మూల నక్షత్రం కావడంతో మహా సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. త్రిపురాంతకం బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. బేస్తవారపేట, త్రిపురాంతకం, కొమరోలు, పుల్లలచెరువు, కంభం, యర్రగొండపాలెంలో, మార్కాపురం పట్టణంలో చెన్నకేశవస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కొమరోలులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. – న్యూస్‌టుడే బృందం


యర్రగొండపాలెంలో


మార్కాపురం పట్టణంలో..

పొదిలమ్మకు హారతి ఇస్తున్న చిన్నారులు →



11వ తేదీ వరకు దరఖాస్తు గడువు పెంపు

మార్కాపురం, కంభం, న్యూస్‌టుడే: ప్రభుత్వం మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువు ఈనెల 11వ తేదీ వరకు పొడిగించినట్లు మార్కాపురం ప్రొహిబిషన్- ఎక్సైజ్‌శాఖ సహాయ సూపరింటెండెంట్ బాలయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి లాటరీ పద్ధతి ద్వారా తీసి కేటాయిస్తారని తెలిపారు. ❖ కంభం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లో ఏరాటు చేయనున్న 10 మద్యం దుకాణాలకు బుధవారం సాయంత్రానికి 154 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ సీఐ కొండారెడ్డి తెలిపారు.

మార్కాపురం

• మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

గిద్దలూరు పట్టణం : గిద్దలూరు నగర పంచాయతీ లోని 132/33కేవీఏ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ శేషగిరిరావు తెలిపారు. గిద్దలూరు, కొమరోలు మండలాల్లోని అన్ని విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో, రాచర్ల మండలం ఎడవల్లి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో విద్యుత్తు సరఫరా ఉండదని ఆయన తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పొదిలి : పొదిలి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఇద్దరు వంట సహాయకులు పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియామకం జరిపే ఈ పోస్టుల కోసం ఈనెల 15 లోపు విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

కందిపప్పు బొక్కేశారు

❖ పండగకు పంపిణీ చేయని వైనం ❖ సరఫరా కాలేదంటున్న డీలర్లు

గత ప్రభుత్వం అయిదేళ్ల పాలన కాలంలో కేవలం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యాన్ని మాత్రమే చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేసింది. కందిపప్పునకు తిలోదకాలు వదిలింది. పండగలకు అందించినా దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం రాకతో తమకు కందిపప్పు, పంచదార అందుతుందని ఆశించిన వినియోగదారుల ఆశలపై డీలర్లు నీళ్లు చల్లేశారు. ప్రభుత్వం కేటాయించిన వాటిని పక్కదారి పట్టించారు. అధికారుల నిర్లక్ష్యం దీని కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. - న్యూస్‌టుడే, మార్కాపురం

దసరా సందర్భంగా ప్రతి కార్డుదారుడికి కందిపప్పు, పంచదారను పంపిణీ చేయాలని నిర్ణయించి ప్రతి చౌకదుకాణం ద్వారా కార్డుదారులకు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చౌకదుకాణాలకు 40 శాతం కందిపప్పు, పంచదార వంద శాతం కోటాను ప్రభుత్వం విడుదల చేసినా ప్రజలకు మాత్రం ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరలేదు. మార్కాపురం పౌరసరఫరాల శాఖ పరిధిలోని చౌకదుకాణాలకు 25 టన్నుల కంది పప్పును కేటాయిస్తే వాటిని పక్కదారి పట్టించిన డీలర్లు బొక్కేశారు. కనీసం ఒక్క కిలో కందిపప్పు ప్యాకెటు కూడా ఇవ్వలేదని, చక్కరదీ అదే పరిస్థితి అని వినియోగదారులు వాపోతున్నారు. డీలర్లను అడిగితే ప్రభుత్వం పంపిణీ చేయలేదని చెప్పి కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

కందిపప్పు కిలో రూ.67కు కార్డుదారులకు ఇవ్వాల్సి ఉంటే వారికి పంపిణీ చేయకుండా వచ్చిన మొత్తాన్ని బయట కిలో రూ.70 నుంచి రూ.75 వరకు బ్లాక్‌లో విక్రయం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వచ్చిన కందిపప్పును మొత్తం పూర్తి స్థాయిలో స్వాహా చేసినట్లు పలువురు పేర్కొంటున్నారు. పంచదార అరకిలో రూ.17గా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కార్డుదారుల వద్ద అర కిలో రూ.20 వరకు తీసుకుంటున్నారు. గత వారం రోజులుగా అన్ని ప్రభుత్వ చౌకదుకాణాల పరిధిలో బియ్యంతో పాటు కందిపప్పు, చక్కర పంపిణీ జరుగుతున్నా అధికారులు కనీసం పరిశీలన చేయలేదనే విమర్శలు ఉన్నాయి.. పర్యవేక్షణ చేసి అక్రమాలను అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోకుండా మామూళ్లతో మత్తులో ఉన్నారని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ప్రజలకు కందిపప్పు, పంచదారను పూర్తి స్థాయిలో పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మార్కాపురం పౌరసరఫరాల శాఖ పరిధి	చౌక దుకాణాలు	కార్డుదారులు
మార్కాపురం అర్బన్, మార్కాపురం మండలం కంభం అర్బన్, కంభం మండలం, పెద్దారవీడు, అర్ధవీడు	142	65,000




బియ్యాన్ని తీసుకుంటున్న వినియోగదారులు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

చౌకదుకాణాలను పరిశీలిస్తాం. వచ్చిన 40 శాతం కందిపప్పును పంపిణీ చేశారా లేదా విచారిస్తాం.
– మార్కాపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉప తహసీల్దారు అర్జున్‌రెడ్డి, మార్కాపురం తహసీల్దారు చిరంజీవి.




గిద్దలూరు: కృష్ణంశెట్టిపల్లెలో పూర్వవిద్యార్థుల సందడి.. రాచర్ల : జెల్లివారి పుల్లలచెరువులో గురువులతో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

గిద్దలూరు పట్టణం, కంభం (రాచర్ల), న్యూస్‌టుడే : గిద్దలూరు నగర పంచాయతీలో 1991లో పదో తరగతి పూర్తిచేసిన, 1991-93 ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె గ్రామంలోని ప్రతాప్‌రెడ్డి తోటలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మిత్రుల కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమతోపాటు చదివి మృతిచెందిన సహచర మిత్రులకు నివాళులర్పించారు. ❖ రాచర్ల మండలం జెల్లివారిపుల్లలచెరువు ఉన్నత పాఠశాలలో 2006 -2007 ఏడాది పదో తరగతి విద్యార్థుల పూర్వ సమ్మేళనం బుధవారం పాఠశాలలో నిర్వహించారు. ఒకరినొకరు తమ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన చేసిన ఉపాధ్యాయుడు పిచ్చిరంగయ్యను సన్మానించారు. తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ షేక్ మహబూబ్‌బాషా, హెడ్‌మాస్టర్‌ను సత్కరించారు.

ఘనంగా ఎమ్మెల్యే ముత్తుముల జన్మదిన వేడుకలు

గిద్దలూరు పట్టణం, బేస్తవారపేట, కొమరోలు, కంభం, కంభం (రాచర్ల) : ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గిద్దలూరు తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిశోర్‌రెడ్డి కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. భాజపా నాయకులు వైద్యశాల ఆవరణలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ❖ బేస్తవారపేటలోని బస్టాండ్ వద్ద, ఆర్కే నగర్ జంక్షన్ లోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద తెదేపా, జనసేన నాయకులు కేక్ కోసి అందరికీ పంచిపెట్టారు. ❖ కొమరోలులోని దద్దవాడలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ❖ కంభం మండలం కందులాపురం కూడలిలో కేకు కట్ చేసి పంచిపెట్టారు. ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. రాచర్లలో చిల్లచెట్లను జనసేన నాయకులు డోజర్ సాయంతో తొలగించారు. ❖ ఉండవల్లిలోని సీఎం చంద్రబాబునాయుడును బుధవారం గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కలిశారు. సీఎం ఆయనకు స్వీటు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.


కంభం : కందులాపురం కూడలిలో కేకు కోస్తున్న తెదేపా నాయకులు


ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


గిద్దలూరు కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేసోదరుడు, తెదేపా నాయకులు

పథకాలపై అవగాహన

పొదిలి గ్రామీణం, అర్ధవీడు, గిద్దలూరుపట్టణం, బేస్తవారపేట, కంభం, కంభం(రాచర్ల), యర్రగొండపాలెం, న్యూస్‌టుడే : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం పొదిలి మండలంలోని ఓబులక్కపల్లి గ్రామంలో ఏవో జైనులాబ్దీన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రైతులకు వ్యవసాయ పథకాలను గురించి అవగాహన కల్పించారు. ❖ అర్ధవీడు మండలం దొనకొండ, నాగులవరం గ్రామాల్లోని రైతులతో వ్యవసాయాధికారి మహమ్మద్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ❖ గిద్దలూరు మండలం కొమ్మునూరు, పొదలకుంటపల్లెలో ఏవో యేరువ విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయాధికారులు రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో శనగ పంట సాగుచేస్తున్న రైతులకు 25శాతం రాయితీతో ప్రభుత్వం శనగ విత్తనాలు అందజేస్తోందని తెలిపారు. ❖ బేస్తవారపేట మండలంలోని నేకునాంబాద్, చింతలపాలెం గ్రామాల్లో ఏవో జ్ఞాన మేర్సీ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ❖ కంభం-2, చిన్నకంభం పరిధిలో వ్యవసాయాధికారిణి స్వరూప కంది పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ❖ రాచర్ల మండలంలోని చోళేడు, ఆకవీడు గ్రామాల్లో వ్యవసాయాధికారి అబ్దుల్ రఫీక్ కంది, మిరప పంటలను పరిశీలించారు. ❖ యర్రగొండపాలెంమండలంలోని కొలుకుల గోళ్లవిడిపి గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008632343
పొదిలి : 8008550360

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:



సమస్య : పట్టణంలోని కంభం సెంటర్, ఆంజనేయస్వామి గుడి, కల్పనా షోరూం తదితర ప్రాంతాల్లో గుంతలు ఏర్పడి సంవత్సర కాలమైంది. వీటిని ఎవరూ పట్టించుకోలేదు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. మరమ్మతు చేయించండి. – పి.కొండయ్య, పట్టణవాసి

సమాధానం : నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు చేపట్టి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. – సందీప్, ఆర్అండ్‌బీ ఏఈ, మార్కాపురం

కంభం, న్యూస్‌టుడే

సమస్య : మండలంలోని హజరత్‌గూడెం వెళ్లే సిమెంట్ రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. మరమ్మతులు చేయించండి. – వెంకటేశ్వర్లు, స్థానికుడు

సమాధానం : రహదారిని బాగు చేయించేందుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరుకాగానే చర్యలు తీసుకుంటాం.– జోష్యులు, పంచాయతీ కార్యదర్శి, హజరత్‌గూడెం

పొగాకు సాగుకు సమాయత్తం

పొదిలి, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంతంలోని పొగాకు రైతులు సాగు విస్తీర్ణం పెంచే ఆలోచనలో ఉన్నారు. ఈ ఏడాది మార్కెట్ ఆశాజనకంగా ఉండటం, గతంలో పోలిస్తే ధరలు భారీగా పెరగడంతో రైతులకు మేలు జరిగింది. వచ్చే ఏడాది సైతం ఇదే మార్కెట్ ఉంటుందన్న ఆశతో రైతులు ఇప్పటికే పొగాకు సాగుకు సిద్ధమయ్యారు. బ్యారన్ రిజిస్ట్రేషన్, నారుమడుల పెంపకం, పొలాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కొంతమంది రైతులు నాట్లు సైతం వేసేందుకు సిద్ధమవుతున్నారు. పొదిలి వేలం కేంద్రంలో గత ఏడాది 9.65 మిలియన్ కిలోల పొగాకు అనుమతించగా అదనంగా 5.15 మిలియన్ కిలోల పొగాకును రైతులు పండించారు. అదనపు పంటతో రైతులకు రూ.134 కోట్ల రూపాయలు రాబడులు వచ్చాయి. ఈ రాబడులతో ప్రస్తుత సీజన్‌లో రైతుల పెట్టుబడికి ఎంతో మేలు చేకూరనుంది. పొగాకు సాగుకు బ్యాంకర్లు రూ.4 లక్షల వరకు పిలిచి మరీ రుణాలు ఇస్తుండటం రైతులకు కలిసొస్తుంది. దీంతో రైతులు గత ఏడాది మాదిరిగానే సాగు చేసే ఆలోచనలో ఉన్నారు. పొదిలి వేలం కేంద్రంలో 4332 మంది రైతులు, 2400 బ్యారన్లు ఉన్నాయి. పశ్చిమ ప్రాంతంలో సాగునీటి వనరులు లేనందున వర్షాధారంపై పండే పొగాకు సాగు వైపే ఈ ప్రాంత రైతులు మొగ్గుచూపుతున్నారు. కాలం కలిసొచ్చి రెక్కల కష్టానికి ఫలితం దక్కుతుండటంతో పొగాకు వైపే ఆసక్తి చూపుతున్నారు. పొదిలి, కనిగిరి, మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లోని రైతులు కొంతమంది వర్జీనియా పొగాకుతో పాటు బర్లీ పొగాకును సైతం పండించి లాభాలు గడిస్తున్నారు. బర్లీ సాగు చేసేవారు ఇప్పటికే నాట్లు పూర్తిచేశారు. వర్షాలు పడుతుండటం పొగాకు రైతులకు కలిసొస్తుంది.


బర్లీ పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

మురారిపల్లె సంఘటనపై సీఐ విచారణ

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మురారిపల్లెలో రెండు వర్గాల మధ్య ఆధిపత్యం కోసం జరిగిన సంఘటనపై బుధవారం రాత్రి పుల్లలచెరువు సీఐ ప్రభాకరరావు మురారిపల్లె వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన రమణారెడ్డి ఉచిత మంచి నీరు సరఫరా విషయంలో జరిగిన ఘర్షణపై, గతంలో గ్రామంలోకి పోలీసులు వెళ్లి మాట్లాడిన వైనం పై ఆయన గ్రామస్థులతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వర్గాల పోరు పోలీసులకు తలనొప్పిగా మారిందన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు.

పాలనలో భాగస్వాములుకండి

బేస్తవారపేట: గ్రామ పంచాయతీల పాలనలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో రంగనాయకులు పేర్కొన్నారు. బుధవారం బేస్తవారపేటలోని మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ పాలనకు సంబంధించి ముఖ్యమైన పది అంశాలపై రెండు రోజుల పాటు సభ్యులకు శిక్షణ ఇచ్చినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఈవో సేవలు మరవలేనివి

కంభం : స్థానిక పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారిగా బ్రహ్మయ్య అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ అన్నారు. ఈవో బదిలీని పురస్కరించుకొని స్థానిక సచివాలయం-1 వద్ద సర్పంచి బోడెయ్య అధ్యక్షతన ఆయనకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈవోను ఘనంగా సన్మానించారు.


ఈవో బ్రహ్మయ్యను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

గుర్తుతెలియని వాహనం ఢీ కొని.. ఒకరి మృతి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం గ్రామ శివారులోని మిట్టమీదపల్లె అడ్డ రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కంభం పట్టణానికి చెందిన కొప్పుల వెంకట సాయి కృష్ణ (25) కృపాకరరావులు వ్యక్తిగత పనుల నిమిత్తం బుధవారం ద్విచక్ర వాహనంపై మార్కాపురం పట్టణానికి వచ్చి తిరుగుప్రయాణమయ్యారు. తిప్పాయపాలెం గ్రామ శివారులోని మిట్టమీదపల్లె అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో వెంకట సాయి కృష్ణ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడి కృపాకరరావును స్థానికులు 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి గాయలు

కంభం : ఆగి ఉన్న వాహనాన్ని ఆటో ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన స్థానిక నీటి పారుదల శాఖ కార్యాలయ సమీపంలో అమరావతి- అనంతపురం జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. కంభం వైపు నుంచి మార్కాపురం ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఆపిఉన్న క్రేన్‌ను ఢీ కొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సత్యనారాయణ, రమాదేవికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు.

దుప్పట్ల పంపిణీ

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే : ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకను పురస్కరించుకొని ఫాతిమా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నంద్యాల కాసింవలి రాచర్లలోని మదరాసా విద్యార్థులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖాదర్‌వలి, దస్తగిరి, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల నిలిపివేత

ఈనాడు కథనానికి స్పందన

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: బాలాత్రిపురసుందరీదేవి ఆలయ సమీపంలోని బయట బాలమ్మ ఆలయానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని నిలిపివేశారు. బాలాత్రిపురసుందరీదేవి ఆలయానికి రాకపోకలు సాగించే దారికి ఎదురుగా ఆక్రమణల వల్ల ఉత్సవాల వేళ భక్తులకు అసౌకర్యం కలుగుతున్న ఈనేపథ్యంలో 'ఆలయం చెంత అక్రమ కట్టడాలు' కథనం ఆగస్టు 10న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ, దేవస్థానం అధికారులు కట్టడాల నిర్మాణాన్ని ఆపివేయించి ఆ స్థలం చుట్టూ ఇనుక తీగతో కంచె వేశారు.


నిర్మాణాన్ని ఆపేసి కంచె వేసిన స్థలం

సర్వజన ఆసుపత్రి.. కంపు కొడుతోంది

❖ అధ్వానంగా మురుగు కాలువల వ్యవస్థ ❖ ఇబ్బందులు పడుతున్న రోగులు.. సహాయకులు

మార్కాపురం, న్యూస్‌టుడే:

ఎవరైనా రోగులు ఉన్న రోగాన్ని వదిలించుకోవడానికి వైద్యశాలలకు వెళ్తారు. కానీ మార్కాపురంలో సర్వజన వైద్యశాలలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నం. ఇక్కడి పరిసరాల కారణంగా వ్యాధులు మరింత విజృంభించే పరిస్థితులు ఉన్నాయి. వైద్యశాలకు వ్యాధి నయం కోసం వస్తే లేని రోగం వచ్చేటట్టు ఉందని పలువురు వాపోతున్నారు.

మురుగుకాలువల వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో దుర్వాసనతో రోగులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి. వైద్యశాల చుట్టూ మొత్తం మురుగు నీరు నిల్వ ఉంటుంది. సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేకపోడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. డయాలసిస్ కేంద్రంకు సమీపంలోనే పెద్ద మురుగు కూపం ఉంది. జనరల్ వార్డు కిటికీలకు సమీపంలనే మురుగు నీరు నిల్వ చేరిన దుర్వాసన వెదజల్లుతోంది. రెండు రోజుల కిందట భారీ వర్షానికి పరిసరాలు మరింతగా మారిపోయాయి. జర్వజన వైద్యశాల కోసం అదనపు గదులు నిర్మాణం చేసిన సమయంలో ఎక్కడి పనులు అక్కడే వదిలేయడంతో చెత్త పేరుకుపోయింది.


కాలువలు లేక నిలిచిపోయిన మురుగునీరు

పరిసరాలను శుభ్రం చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశించి నెల రోజులు కావసున్నా వైద్యశాల అధికారులు, పారిశుద్ధ్య విభాగం అధికారులు పట్టించుకోలేదని రోగులు వాపోతున్నారు.

మార్కాపురంలోని కంభం రహదారిలోని జంకెరామిరెడ్డి కాలనీలో మొదటగా మార్కాపురం ఏరియా వైద్యశాలను 2001లో ఏర్పాటు చేశారు. ఆ తరువాత జిల్లా వైద్యశాలగా మార్పు చెందింది. ఈ ఏడాదిలో సర్వజన వైద్యశాలగా మారిపోయింది. దీనికి అనుబంధంగా ప్రభుత్వ వైద్య కళాశాలను కూడా మార్కాపురంలో నిర్మాణం చేస్తున్నారు. సుమారు వైద్యులు 50 మంది వరకు ఉన్నారు. వైద్య సిబ్బంది 150 మంది వరకు అందుబాటులో ఉన్నారు. అన్ని రకాల వైద్యసేవలు అందుతున్నాయి. రోజుకు ఓపి 550 నుండి 625 వరకు వస్తున్నాయి. వైద్యశాలలో వైద్య నిపుణులు ఉండటంతో రోగుల సంఖ్య కూడా పెరుగుతుంది. అయితే వసతులు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. 23 ఏళ్లుగా వైద్యశాలకు సరైన మురుగునీటి పారుదల వ్యవస్థలేదు. ఎక్కడికక్కడ మురుగుకాలువలు ధ్వంసమయ్యాయి. దీంతో రహదారులపైన మురుగు నీరు పారుతుంది. మురుగు నీటి వ్యవస్థను మెరుగుపర్చడానికి అధికారులు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించినా మంజూరు కాకపోవడంతో సమస్య అలాగే ఉండిపోయింది. వైద్యశాల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రోగులు, సహాయకులు కోరుతున్నారు.


వైద్యశాల జనరల్ వార్డు పక్కనే పరిస్థితి ఇదీ...


రహదారులపై నిలిచిన వర్షపు నీరు

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలం కేంద్రం హనుమంతునిపాడులో ఎక్కడి అక్కడే చెత్త పేరుకు పోయింది. కొన్ని వీధుల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోగలరు. - ఎం.నరసయ్య, మాజీ సర్పంచ్

సమాధానం: సర్పంచికి సూచనలిచ్చి చెత్త తొలగిస్తాం - బ్రహ్మాచారి, పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని వల్లాయిపాలెం ఎస్సీకాలనీలో వీధిదీపాలు మరమ్మతునకు గురయ్యాయి. రాత్రి పూట ఇబ్బందికరంగా ఉంది. - ఏసుదాసు, స్థానికుడు

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వీధిదీపాలు మరమ్మతులు చేయిస్తాం. - సాంబశివరావు, ఈవోఆర్డీ

విద్యుత్తు తీగల ఎత్తు పెంపు

స్పందనకు వందనం

పీసీపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని తలకొండపాడు ఎస్సీ కాలనీ నివాసాలకు విద్యుత్తు సరఫరా అయ్యే పరివర్తకం వద్ద తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. ఈ సమస్యపై ఈనాడులో బుధవారం మేమున్నాం..మీకు తోడుగాలో వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు శాఖ ఏఈ లక్ష్మీరాజేష్ బుధవారం తన సిబ్బందితో తీగలను ఎత్తుకు పెంచి కంచె ఏర్పాటు చేశారు.

మరుగుదొడ్లు శుభ్రం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి మండల అభివృద్ధి కార్యాలయంలో మరుగుదొడ్లు వినియోగించుకోవాలంటే ముక్కులు మూసుకోవాల్సి వస్తుంది. ఈ సమస్యపై ఈ నెల 6వ తేదీన 'లోపలికి వెళ్లే ముక్కు మూసుకోవల్సిందే' అనే శీర్షిక ఈనాడులో కథనం ప్రచురితమైంది. కొండపి ఎంపీడీవో రామాంజనేయులు స్పందించి అధ్వానంగా మారిన మరుగుదొడ్లను శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు.

కేజీబీవీలో సిబ్బంది నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

దర్శి, న్యూస్‌టుడే: సమగ్రశిక్ష సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న దర్శి కేజీబీవీలో ఖాళీగా ఉన్న నాలుగు బోధనేతర సిబ్బంది నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రఘురామయ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి అవుట్ సోర్సింగ్ విధానంలో ఈ నియామకాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. సహాయ వంటవారుగా ఇద్దరు, నైట్‌వాచ్‌మెన్‌గా ఒకరు, స్కావెంజర్‌గా ఒక పోస్టుకు నియామకం చేపడుతున్నారు. వంట వారికి ఎలాంటి విద్యార్హత అవసరం లేదని, ఇతర పోస్టులకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఓసీలకు 42 ఏళ్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 47 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలని పేర్కొన్నారు.

అభాగ్యుల పాలిట ఆప్త బంధువులు

వారంతా చిరుద్యోగులు.. చేతివృత్తి పనులు చేసుకునే యువకులు.. ఆకలితో అలమటించే వారికి కడుపు నిండా కూడు పెట్టాలనే సంకల్పించుకున్నారు. ఆశయం నెరవేర్చేందుకు చేయి చేయి కలిపారు. యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ పేరుతో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. రోడ్లు, బస్‌షెల్టర్లలో తలదాచుకునే అభాగ్యులకు దాతలు అందించిన సాయంతో భోజన వసతి కల్పిస్తున్నారు. తమ సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు సంస్థలోని సభ్యులు. - టంగుటూరు, న్యూస్‌టుడే:

నలుగురితో ప్రారంభమై..

టంగుటూరుకు చెందిన యువకులు దేవరపల్లి చంద్రశేఖర్, కురుగుండ్ల ప్రవీణ్, చల్లాపల్లి సుబ్బారావు, చాట్రగడ్డ శ్యామ్ చేతివృత్తులు చేస్తుంటారు. వారందరూ 2020 ఏప్రిల్ 6న యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశారు. మొదట్లో సొంత నగదు వెచ్చించి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం దాతలు, మరికొంత మంది స్నేహితులు చేయూతనందించారు. ఇలా మొదలైన ప్రయాణం అందరి మన్నలు పొందుతూ సేవల దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం సంస్థలో 50 మంది దాకా పనిచేస్తున్నారు.

దాతల సహకారంతో ముందుకు సాగుతూ..

కరోనా లాక్‌డౌన్ సమయంలో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. రోడ్ల వెంట నడిచి వెళ్లే వారి దీనస్థితిని చూసి చలించిపోయారు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు. వారికి భోజనం, తాగునీరు అందించి దాతృత్వం చాటుకున్నారు. తమ సేవలు మరింత విస్తృతం చేయాలనే లక్ష్యంతో పట్టణంలోని పలువురు దాతలను సంప్రదించి వారిని సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేశారు. వారందరూ అందించే సాయంతో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరకులు, దుస్తులు ఇతరత్రా వసతులు కల్పిస్తున్నారు. ప్రారంభంలో సొంత ద్విచక్ర వాహనాలపై వెళ్లి ఆహార పొట్లాలు అందించేవారు. ప్రస్తుతం దాతలు సహకారంతో కొనుగోలు చేసిన ఓ వాహనం ద్వారా రహదారి, బస్‌షెల్టర్లలో తలదాచుకునే వృద్ధులు, యాచకులు, మతిస్థిమితం లేని వారికి భోజనం అందిస్తున్నారు. ఇప్పటి వరకు 748 సేవా కార్యక్రమాలు నిర్వహించగా.. రూ.15,66,396 ఖర్చు చేశామని సభ్యులు చెబుతున్నారు. భోజనాలు అందించే సమయంలో రహదారిపై వాహనం నిలిపిపోవడం, మొరాయిస్తుండడంతో కొంతమేర సతమతమవుతున్నట్లు వారు చెబుతున్నారు.



స్వచ్ఛంద సంస్థలోని సభ్యులు

ఈ-పంట నమోదులో అవకతవకలకు పాల్పడితే చర్యలు

ముండ్లమూరు, కురిచేడు, దొనకొండ: ఈ పంట నమోదులో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న హెచ్చరించారు. మండలంలోని ముండ్లమూరు, చింతలపూడి గ్రామాల్లో బుధవారం పర్యటించి ఈ క్రాప్ నమోదు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రైతులతో మాట్లాడారు. వీఆర్వోలు, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా... వ్యవసాయంపై ఏమైనా సూచనలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎల్.లక్ష్మీనారాయణ, డీటీ ఆర్.శ్రీకాంత్, సీనియర్ సహాయకులు శేషగిరిరావు, ఆర్ఐ మూర్తి, మండల సర్వేయర్ కోటంరాజు, వీఆర్వో తేజా, తదితరులు పాల్గొన్నారు. ● దొనకొండలో పరిశ్రమలు వచ్చేలా తన వంతు కృషి చేస్తానని కనిగిరి ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో పరిశ్రమలకు కేటాయించిన భూములు ఏపీఐఐసీ పార్కును చూసి మ్యాపులతో ఎక్కడ ఏ భూములు ఉన్నాయో తెలుసుకున్నారు. విమానాశ్రయం భవనం, భూములను పరిశీలించారు. ఏ పంట వేశారో అదే నమోదు చేయాలని అలా చేయకుంటే ప్రభుత్వం నష్ట పోయిన వారికి పరిహారం ఇచ్చినప్పుడు వారికి రాదని చెప్పారు. ●కురిచేడు మండలంలోని పేరంబొట్లపాలెంలో ఈ పంటను నమోదు కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి పరిశీలించారు.



ముండ్లమూరులో మిరపతోటను పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

దర్శి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

దర్శి: దర్శి నగరపంచాయతీని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. దర్శిలో పొదిలి, గంగవరం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ (టవర్) లైట్లతో పాటు 19వార్డు లోని పుచ్చలమెట్టలో డివైడర్లపై ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలను మాజీ ఎమ్మెల్యే పాపారావుతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. దర్శిలో ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. నగరపంచాయతీ ఛైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేష్, కౌన్సిలర్లు, అధికారు లు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



టవర్ లైట్లను ప్రారంభిస్తున్న తెదేపా నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

చదువులమ్మకు జేజేలు



సింగరాయకొండలో చెట్టుమహాలక్ష్మమ్మ



దర్శిలో సరస్వతీదేవిగా పోలేరమ్మ తల్లి




తాళ్లూరు: గంగభవాని అమ్మవారు..



కొండపి: పెద్దకండ్లగుంట గ్రామ శివాలయంలో..

న్యూస్‌టుడే బృందం: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఏడోరోజైన బుధవారం అమ్మవారు సరస్వతీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. కనిగిరి పట్టణంలోని అంకాళేశ్వరి దేవస్థానం, సాయిబాబాదేవస్థానాల్లో మహిళలు కుంకు మార్చనలు నిర్వహించారు. మూల నక్షత్రం కావడంతో తల్లిదండ్రులు చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. దర్శిలోని కనకదుర్గమ్మ, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో తెదేపా నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి, పిచ్చయ్య పూజలు నిర్వహించారు. కొండపిలోని పెద్ద కండ్లగుంట శివాలయంలో విద్యార్థులు పెన్ను, పుస్తకాలు అమ్మవారి ముందు పెట్టి సరస్వతీ దేవీ పూజ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కనిగిరి వెంకటేశ్వర దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి 101 మంది దంపతులు ప్రత్యేకంగా కల్యాణాలు నిర్వహించారు.



ముండ్లమూరు: భ్రమరాంబ అమ్మవారు



భైరవకోనలో సరస్వతీదేవిగా త్రిముఖ దుర్గాంబ



కొండపి: సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు

ముగిసిన పొగాకు చూర, పండుగుల్ల వేలం ప్రక్రియ

టంగుటూరు, న్యూస్‌టుడే: 2023-24 పొగాకు పంట కాలానికి టంగుటూరు పొగాకు బోర్డు పరిధిలో చూర, పండుగుల్ల వేలం ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఈ ఏడాది పంటకాలానికి 7,31,815.4 చూర, పండుగుల్ల కిలోలు విక్రయించారు. మొత్తంగా గరిష్ఠ ధర రూ.229 పలకగా.. కనిష్ఠ ధర 60లు పలికింది. సగటు ధర రూ.97.10 పలికింది. ● టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 523 బేళ్ల కొనుగోలు జరిగాయి. బోర్డు పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు 670 బేళ్లను తీసుకురాగా.. అందులో 523 బేళ్లను వివిధ కంపెనీలు కొనుగోలు చేశాయి. 147 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.229, కనిష్ఠ ధర రూ.60లు పలికిందని వేలం కేంద్ర నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ● కొండపి గ్రామీణం: కొండపి వేలం కేంద్రంలో బుధవారం పొగాకు చూర బేళ్లను 441 కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం, ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, చౌటపాలెం, దాదానాయుడుపాలెం, పోలిరెడ్డిపాలెం, రామాయపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి, ఎన్.ఎన్.కండ్రిక, పెట్లూరు, వర్ధినేనివారిపాలెం, నరసరాజుపాలెం, పెద్దకండ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు వేలం కేంద్రానికి 688 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, అందులో 441 బేళ్లను కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.136, కనిష్ఠ ధర రూ.40, సరాసరి ధర రూ.61.64 పలికిందన్నారు.



సంతోషం వ్యక్తం చేస్తున్న అధికారులు, రైతులు, సిబ్బంది

వానొస్తే.. రోడ్లన్నీ చెరువులే



పూర్వపు కొట్ల బజారు సమీపాన చెరువులా..



తాళ్లూరులోని బస్టాండు సెంటరు ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో బుధవారం భారీగా వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. రూ.లక్షల కొద్ది నిధులు వెచ్చించి రహదారులను అభివృద్ధి చేసినా వర్షపు నీరు, మురుగు పోయేందుకు వీలుగా నిర్మించిన కాలువలు పూడిపోవడం, కొందరు గృహస్థులు, వ్యాపారులు గృహాలతోపాటు దుకాణాల ముందు స్థలాల్లో మట్టి తోలించి ఎత్తుగా చేయడంవల్ల ఈ సమస్య ఏర్పడింది. వర్షపునీరంతా రోడ్లపై చేరి రాకపోకలకు సాగించే ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొట్ల బజారులోని గృహాలు లోతట్టుగా ఉండడంతో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరడంతో ఆప్రాంత ప్రజలు బకెట్లుతో బయటకు ఎత్తి పోయాల్సి వచ్చింది. సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వాసవీ మాత దేవస్థానం పునఃనిర్మాణానికి పూజలు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలో అత్యంత వ్యయంతో పునఃనిర్మాణం జరుగుతున్న శ్రీవాసవీ కన్యకాపరిమేశ్వరి దేవస్థానానికి బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా గర్భగుడికి, ఉపాలయానికి దర్వాజాలు ఏర్పాటు చేశారు. ముందుగా ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రార్చనల మధ్య దర్వాజాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం గౌరవాధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు దేవకి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కొలిపర్తి వెంకటస్వామి, కోశాధికారి బచ్చు రమేష్, సభ్యులు మల్లికార్జునరావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. ● పామూరు: మండలంలోని తిరగలదిన్నె గ్రామంలో కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్థులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.



గర్భగుడి దర్వాజాలకు పూజలు చేస్తున్న మహిళలు

భౌ..భౌలతో బెంబేలు



దర్శి నగరపంచాయతీలోని శివరాజ్‌నగర్ గ్రామంలో కుక్కలు ప్రజలను భయపెడుతున్నాయి. గ్రామంలోని పలు వీధుల్లో శునకాలు గుంపులుగా తిరుగుతూ రాకపోకలు సాగిస్తున్న వారి వెంటబడుతున్నాయి. తల్లిదండ్రులు పిల్లలు ఒంటరిగా బయటకు పంపడానికి భయపడుతున్నారు. రాత్రివేళలో అయితే కనిపించిన వారిపై దాడులు చేస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. కుక్కలను పట్టుకోవడంలో నగరపంచాయతీ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను పట్టుకుని వాటి బెడద నుంచి తమను రక్షించాలని వారు కోరుతున్నారు. దీనిపై కమిషనర్ మహేష్‌ను వివరణ కోరగా.. కుక్కలను పట్టుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. - న్యూస్‌టుడే, దర్శి

చేగువేరా స్ఫూర్తితో పోరాడుదాం

దర్శి, న్యూస్‌టుడే: చేగువేరా స్ఫూర్తితో మతోన్మాదాన్ని తరిమి కొట్టి, లౌకిక తత్వాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పిచ్చయ్య పేర్కొన్నారు. దర్శిలో ఆ సంఘం ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, జెస్సీపాల్, వెంకటరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నేత పిచ్చయ్య తదితరులు

ఆకస్మిక గుండెపోటుతో రైతు మృతి

దర్శి: గుండెపోటుతో రైతు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని రాజంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని లక్ష్మీనారాయణపురం చెందిన తమ్మిశెట్టి వెంకటయ్య (65) తన ద్విచక్ర వాహనంపై రాజంపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓ చోట మూత్రవిసర్జన కోసం ఆగాడు. ఈ క్రమంలో గుండెనొప్పి రావటంతో అక్కడే పడిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు అతని వద్దకు వెళ్లి పరిశీలించారు. అప్పటికే అతను మృతి చెందాడు. విషయం తెలుసుకుని పోలీసులు, కుటుంబ సభ్యులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మద్యం దుకాణాలకు 249 దరఖాస్తులు

కనిగిరి, తాళ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానంలో భాగంగా మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానించింది. కనిగిరి నియోజకవర్గంలో 19 దుకాణాలకు గాను బుధవారం నాటికి 249 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ విజయ్ భాస్కర్ తెలిపారు. కనిగిరి పట్టణంలో 6, మండలంలో 3 దుకాణాలు, పామూరులో 4, సీఎస్‌పురం 2, వెలిగండ్ల, 2 పీసీపల్లిలో 2 దుకాణాలు ఉన్నాయి. ప్రధానంగా కనిగిరి, పామూరు మండలాల నుంచి 180 వరకు దరఖాస్తులు రాగా. పీసీపల్లి, వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాలకు సంబంధించి 60 వరకు అర్జీలు వచ్చాయి. దరఖాస్తు దాఖలుకు ఈ నెల 11వ తేదీ వరకు గడువు పెంచడంతో మరిన్ని దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది. ● దర్శి నియోజకవర్గం పరిధిలోని అయిదు మండలాల్లో 23 మద్యం దుకాణాల నిర్వహణకు 209 మంది దరఖాస్తులు చేశారని దర్శి ఎక్సైజ్ విభాగం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

పొలం వెళ్లే దారి ఆక్రమణపై ఫిర్యాదు

వెలిగండ్ల: పొలాలకు వెళ్లే దారిని కొందరు రాజకీయ పలుకుబడితో ఆక్రమించడంపై మండలంలోని చందలూరిపాడు గ్రామస్థులు బుధవారం తహసీల్దార్‌కు సువర్ణకు ఫిర్యాదు చేశారు. పూర్వకాలం నుంచి వ్యవసాయ పొలాల్లోకి వెళ్లే దారిని కొందరు ఉద్దేశపూర్వకంగా ఆక్రమించి వ్యవసాయ పనులకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. దీంతో పొలాలను బీడుగా పెట్టుకోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ ఎస్సై మధుసూదన్‌రావుకు ఆక్రమణలను తొలగించి రాక పోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దర్శి: దర్శి క్రిస్టియన్‌పాలెంకు చెందిన పెయింట్ కార్మికుడు గర్నెపూడి వరప్రసాద్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. తన ప్రతినిధుల ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం రూ.20 వేలు వితరణ చేశారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు

మారెళ్ల (ముండ్లమూరు), న్యూస్‌టుడే: సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి ఎండీ.ఫరూక్ తెలిపారు. మండలంలోని మారెళ్ల, జమ్మలమడక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగు పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ చీడపీడల పంటను ఆశిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాఘవరెడ్డి, వీఏఏ బాలవెంకటయ్య, రైతులు పాల్గొన్నారు. ● కనిగిరి: తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కనిగిరి వ్యవసాయాధికారిణి పి.జోత్స్నదేవి తెలిపారు. మండలంలోని చాకిరాల, ఎన్ గొల్లపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారిణి మాట్లాడుతూ.. ప్రస్తుతం వాతావరణం వేడిగా, పొడిగా ఉన్నందున కందిలో వెర్రితెగులు, ఎండుతెగులు ఉద్ధృతంగా వ్యాపిస్తుందన్నారు. అందుకే రైతులు తెగుళ్లను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



ముండ్లమూరు: కార్యక్రమంలో పాల్గొన్న ఏవో ఫరూక్, రైతులు

మారని పంథా.. ఆగని దందా..

■ పేట్రేగిపోతున్న ఇసుకాసురులు
■ పట్టించుకోని అధికారులు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదు. ఇసుకాసురులు తమ పంథా మార్చుకోవడం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తూ వారు జేబులు నింపుకొంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్లకు మరిగి తూతూ మంత్రంగా తనిఖీ చేసి వదిలేస్తున్నారు. నిత్యం ఇసుక ట్రాక్టర్లు వీధుల్లో తిరుగుతుండటంతో సింగరాయకొండ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళ పెద్ద శబ్దాలతో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో కంటిమీద కునుకు ఉండటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాయకుల అండదండలతో..

రాష్ట్రంలో ఇసుక కొరత లేకుండా, అక్రమ రవాణా జరగకుండా గృహనిర్మాణాలు చేస్తున్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా తక్కువ ధరలకే ఇసుక పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. సర్కార్ ప్రకటిస్తున్న ధరలకు బహిరంగ విపణిలో విక్రయిస్తున్న ధరకు పొంతన ఉండటం లేదు. దీన్ని ఇసుకాసురాలు సొమ్ము చేసుకుంటున్నారు. జరుగుమల్లి మండలం బిట్రగుంట పరిధిలోని పాలేరు, సింగరాయకొండ మండలం మన్నేరు నుంచి నిత్యం రాత్రివేళల్లో వందల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. మండలంలోని కొందరు ద్వితీయ శ్రేణి నాయకుల అండదండలతో పాలేరు నది నుంచి కలికవాయ గ్రామం మీదుగా అక్రమంగా రవాణా జరుగుతుంది. అక్కడ నుంచి దూరప్రాంతాలకు జాతీయ రహదారి మీదుగా చేరవేస్తూ విక్రయిస్తున్నారు.



ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు (పాతచిత్రం)

మామూళ్ల మత్తులో యంత్రాంగం..

స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఆయా శాఖల్లోని కొందరు సిబ్బంది అక్రమార్కుల నుంచి నెలవారీ మామూళ్లు వసూళ్లు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో ట్రాక్టరు నుంచి నెలకు రూ.20 వేలు చొప్పున కొందరు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది తీసుకుంటున్నారని ఇసుక వ్యాపారులు బహిరంగంగానే తెలుపుతున్నారు. గత పది రోజుల క్రితం శానంపూడి గ్రామ పరిధిలోని మన్నేరు నుంచి పట్టపగలే రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో తహసీల్దార్ రవి అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇలా ఒకటి, రెండు సందర్భాల్లో తప్ప మిగిలిన సమయాల్లో ఇసుక తరలిపోతూనే ఉంది.



సింగరాయకొండ తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచి తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్లు

నిఘా పెట్టి అక్రమ రవాణా నిరోధిస్తాం...

రాత్రుల సమయంలో అక్రమంగా ఇసుక తరలించకుండా ప్రధాన రహదారులు, వీధుల వెంబడి సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తాం. అనధికారంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు చేపడతాం. ఇటీవల కాలంలో సుమారు 10 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని జరిమానాలు విధించాం.

- ఎస్సై మహేంద్ర

ఒంగోలు

• ఒంగోలు • సంతనూతలపాడు

రైతు బజార్లలో రాయితీ టమాటా



రైతు బజారులో ఏర్పాటు చేసిన కౌంటర్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని మూడు రైతు బజార్లలో రాయితీ టమాటా విక్రయాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కిలో రూ.50 చొప్పున అందజేస్తున్నారు. దిబ్బల రోడ్డు, కొత్తపట్నం బస్టాండ్, లాయర్‌పేట రైతు బజార్లలో ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరికి రెండు కిలోలు చొప్పున ఇస్తున్నారు. ఇటీవలి వర్షాలకు పంట దెబ్బతిని బయట మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.75 వరకు ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో రోజువారీ వినియోగాన్ని బట్టి ఒక్కో రైతు బజార్‌లో రెండు నుంచి మూడు టన్నులు అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు.

రైతు ప్రయోజనాల పరిరక్షణకు కృషి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు రైతులకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. పేర్నమిట్టలో మిరప సాగు, ఈ-క్రాప్ నమోదును బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నీటి తడులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కర్షకుల ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఏఎంసీలోని వ్యవసాయ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి... ఎరువులు, విత్తనాల నాణ్యత, తేమ శాతాన్ని పరీక్షించే విధానాలు తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏడీ రమేష్‌బాబు, తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, ఏవో పి.పావని, ఉద్యానశాఖాధికారి ప్రత్యూష, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒకటో కేంద్రంలో రూ.507 కోట్ల పొగాకు అమ్మకాలు



మాట్లాడుతున్న బోర్డు మేనేజర్ కృష్ణశ్రీ

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: ఒంగోలు ఒకటో వేలం కేంద్రంలో పొగాకు అమ్మకాలు పూర్తయ్యాయి. మొత్తం 18.70 మిలియన్ కిలోల విక్రయాలు సాగాయి. మొత్తంగా రూ.507 కోట్ల వ్యాపారం జరిగింది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన ముగింపు సమావేశంలో ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ మాట్లాడుతూ... తరువాతి సీజన్‌కు బోర్డు సూచనల మేరకే రైతులు పొగాకు సాగు చేయాలని పేర్కొన్నారు. ఎక్స్‌టెన్షన్ మేనేజర్ దామోదర్, బోర్డు సూపరింటెండెంట్ రవికాంత్, సభ్యులు పొద వరప్రసాద్, ఐటీసీ లీఫ్ మేనేజర్ శివకుమార్, రైతులు, వ్యాపారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సిబ్బందికి అభినందన

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: ఒంగోలు ఆర్టీసీ డిపో పరిధిలో సెప్టెంబర్ నెలకు సంబంధించి... అధిక రాబడి, ఇంధన పొదుపు, ప్రమాద రహిత డ్రైవింగ్ అంశాల ఆధారంగా పలువురిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికచేశారు. కండక్టర్ విభాగంలో పి.హరిబాబు, జి.నాగరాజు, సీహెచ్ సుబ్బారావు, పి.హనుమంతరావు; డ్రైవర్ల విభాగంలో టి.శ్రీనివాసరావు, వై.సాంబయ్య, ఎస్కే శ్రీనివాసులు, పి.ఆంజనేయులు ఎంపికయ్యారు. డీఎం శ్రీనివాసులు వీరికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులతో డీఎం శ్రీనివాసులు

రుణాల సద్వినియోగంతో ఆర్థిక స్వావలంబన

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని డీఆర్‌డీఏ పీడీ టి.వసంతబాయి పేర్కొన్నారు. మండల వెలుగు కార్యాలయంలో వీవోఏలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యూనిట్లు ఏర్పాటుకు రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ రుణాలు ఇస్తారని తెలిపారు. తీసుకొన్న రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించాలన్నారు. పోషకాహార తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నియంత్రణకు అందరూ కృషి చేయాలన్నారు. ఏపీఎం బత్తుల నరేంద్రకుమార్, ఏరియా సమన్వయకర్త విజయమ్మ, శ్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, సీసీలు రామకృష్ణ, రమణమ్మ, కవిత, అరుణ, సిబ్బంది కోటేశ్వరి పాల్గొన్నారు.

మరమ్మతుల పేరిట మెక్కేశారు!

◆ నిర్వహణ కొరవడి మొరాయిస్తున్న మోటార్లు

◆ నగరంలో తరచూ నీటి సరఫరాకు అంతరాయం

న్యూస్‌టుడే - ఒంగోలు నగరం

నగరవాసులకు తాగు నీటిని పంపింగ్ చేసే మోటార్ల నిర్వహణను గత పాలకులు గాలికొదిలేశారు. మరమ్మతుల పేరిట ఏటా రూ.లక్షల్లో ఖర్చు చూపినా... వాటి బాగును విస్మరించి నిధులు నొక్కేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై అప్పట్లోనే తెదేపా కార్పొరేటర్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. ప్రస్తుతం... అవి తరచూ అవి మొరాయిస్తుండడంతో ఆ పరిధిలోని ప్రాంతాలకు రోజుల తరబడి సరఫరా నిలిచిపోయి ఇక్కట్లు తప్పడం లేదు.

- ప్రజారోగ్యశాఖ కార్యాలయం వద్ద ఫిల్టరేషన్ ప్లాంట్‌లో దెబ్బతిన్న వాల్వు బాగుచేస్తుండగా నీరు ఎగదన్ని ఫిల్టరేషన్ ప్లాంట్‌లోని మోటార్లు దెబ్బతిన్నాయి. స్టాండ్‌బై మోటార్లు అందుబాటులో లేక... 24, 25 డివిజన్ల పరిధిలోని లంబాడీ డొంక, ఏకలవ్యనగర్, బండ్లమిట్ట, బాలాజీరావు పేట, పీవీఆర్ బాలికోన్నత పాఠశాల తదితర ప్రాంతాలకు వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. గురువారం సాయంత్రానికి పునరుద్ధరిస్తామని అధికారులు చెబుతున్నారు.
- కొద్ది రోజుల క్రితం... రెండో వేసవి చెరువు వద్ద మోటారు కాలిపోయి గద్దలగుంట, మంగమూరు రోడ్డు, గాంధీనగర్ ప్రాంతాలకు వారం రోజుల పాటు నీరు అందలేదు.



36	నగరంలోని నీటి సరఫరాకు వినియోగిస్తున్న మోటార్లు
10	వీటిలో ఎప్పుడూ మరమ్మతుల్లోనే ఉంటున్నవి (సుమారుగా)
రూ 2.10 కోట్లు	గత అయిదేళ్లలో బాగు పేరిట ఖర్చు చేసిన మొత్తం

సిమెంట్ గట్టును తొలగించి పంపుహౌస్‌లో నిలిచిన నీటిని బయటకు పంపుతున్న సిబ్బంది... లోపల వాల్వు నుంచి ఎగజిమ్ముతున్న నీరు

హిల్ టవర్ వద్ద ఉన్న నాలుగు 45 హెచ్‌పీ మోటార్లలో రెండింటికి దీర్ఘకాలంగా మరమ్మతులు పూర్తికాలేదు. రంగారాయుడు చెరువు సమీపంలోని ఫిల్టర్‌బెడ్‌లో ఉన్న రెండు 40 హెచ్‌పీ మోటార్లలో ఒకటే పనిచేస్తోంది. కొన్ని చిన్న మోటార్లూ తరచూ దెబ్బతింటున్నాయి.

కానరాని స్టాండ్‌బైలు...

నిబంధనల ప్రకారం ప్రతి నాలుగు మోటార్లకు స్టాండ్‌బైగా ఒకటి అందుబాటులో ఉంచాలి. ఉన్న వాటిలో ఏదైనా దెబ్బతింటే... సరఫరాకు ఇబ్బంది లేకుండా దానిని వినియోగించాలి. పాడైన దానిని వెంటనే బాగు చేయించి వినియోగంలోకి తేవాలి. ఈ ప్రక్రియ సరిగా సాగడం లేదు. నెలల తరబడి మరమ్మతులు పూర్తి చేయడం లేదు. ఈ విషయమై అధికారుల పర్యవేక్షణా ఉండడం లేదు. కొన్ని సందర్భాల్లో రెండు మోటార్లు చేయాల్సిన పనిని ఒకే దాంతోనే చేయిస్తూ... రాత్రింబవళ్లు నడుపుతున్నారు. దీంతో వాటి సామర్థ్యమూ దెబ్బతింటోంది.

నిధులు ఖర్చవుతున్నా...

నగరంలో నీటి సరఫరాకు... ఒకటో వేసవి చెరువు దగ్గర రెండు, రెండో చెరువు వద్ద 11, కొత్త ఫిల్టర్ బెడ్‌లో పది, పాత ప్లాంట్ వద్ద నాలుగు, హిల్‌టవర్ రిజర్వాయర్ సమీపంలో అయిదు, రంగారాయుడు చెరువు వద్ద రెండు, పోలీసు క్వార్టర్స్ ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద రెండు మోటార్లు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ బాధ్యతను ఓ సహాయ ఇంజినీర్‌కు అప్పగించారు. క్షేత్రస్థాయిలో మరో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. ఏదైనా మోటారు చెడిపోతే మరమ్మతులు చేపట్టే బాధ్యతను గుత్తేదారుకు అప్పగించారు. ఓవైపు నిధులు ఖర్చవుతున్నా... ఎప్పుడూ దాదాపు పది మోటార్లు మూలనే ఉంటున్నాయి. ఆ ప్రభావం సరఫరాపైనా పడుతోంది.



పంపుహౌస్‌లో ఉన్న మోటార్లు

గతంలోనే తెదేపా నేతల ఫిర్యాదు...

మోటార్ల మరమ్మతుల పేరిట నగర పాలక సంస్థ వారు ఏటా రూ.30 లక్షలకు పైగా గుత్తేదారుకు చెల్లిస్తున్నారు. అత్యవసర సమయంలో పెట్టే ఖర్చు దీనికి అదనం. పేరుకు బాగు చేస్తున్నట్లు చెబుతున్నా... ఈ వ్యవహారంలో నిధులు గోల్‌మాల్ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏ మోటారుకు ఎప్పుడు మరమ్మతు చేశారు, తరువాత అది ఎన్ని రోజులు పని చేసిందన్న పరిశీలన ఉండడం లేదు. లాగ్‌బుక్‌లో ఈ సమాచారమంతా నమోదు చేయాల్సి ఉన్నా ఆ ప్రక్రియ సరిగా సాగడం లేదు. ఈ విషయమై తెదేపా కార్పొరేటర్ రవిచంద్ర, మరి కొందరు... విజిలెన్స్, డీఎంఏ కార్యాలయం, లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. డీఎంఏ అధికారులు కోరిన వివరాలు పంపినా తదుపరి చర్యలు లేవు.

నేడు ఎంపీ మాగుంట పర్యటన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం ఒంగోలులో పర్యటించనున్నారు. సాయంత్రం.. నగరంలోని పలు ఆలయాల్లో నిర్వహించే నవరాత్రి వేడుకల్లో పాల్గొంటారని కార్యాలయం ప్రతినిధులు తెలిపారు.

గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన వ్యక్తి బైండోవర్

ఒంగోలు, న్యూస్‌టుడే: గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన వ్యక్తిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. గ్రానైట్ రవాణాలో చోటుచేసుకుంటున్న చీకటి దందాపై... 'టోకెన్ తీసుకోకుంటే తోలుతీస్తాం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. పోలీసు అధికారుల పేర్లు చెప్పి, తమను కాదని గ్రానైట్ రవాణా చేస్తే ఫ్లైట్ ఎక్కించి విమానం కోటింగ్ ఇప్పిస్తానని బెదిరించిన వ్యక్తి... ఒంగోలుకు చెందిన కాండ్ర శ్రీకాంత్‌గా గుర్తించారు. అతడిని బైండోవర్ చేసినట్లు జిల్లా ఎస్పీ దామోదర్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రౌడీయిజాన్ని సహించేది లేదు...

జిల్లాలో రౌడీయిజాన్ని ఉపేక్షించేది లేదని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. ఒంగోలు పాత మార్కెట్ సెంటర్లో ఆటోడ్రైవర్‌పై దాడిచేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశామని తెలిపారు. వారు గతంలో పలు కేసుల్లో నిందితులని పేర్కొన్నారు. ప్రస్తుతం బెయిల్‌పై ఉండి నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో... వారి బెయిల్ రద్దు చేయాలని కోర్టును కోరనున్నట్లు తెలిపారు. వరుస నేరాలకు పాల్పడుతున్నందున పీడీ యాక్టు ప్రయోగానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఒంగోలు ఒకటో పట్టణ సీఐని ఆదేశించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

వసూళ్లకు పాల్పడిన వ్యక్తుల అరెస్టు

మద్దిపాడు, న్యూస్‌టుడే: పోలీసులమని బెదిరించి రూ.లక్షలు వసూలు చేసిన పెరుసోముల వీరనారాయణ, సత్యనారాయణను మద్దిపాడు పోలీసులు బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఇదే కేసులో ఫిర్యాదుదారు వివరాలను నిందితులకు అందించాడన్న ఆరోపణలతో మురళి అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.

రెండు ఆటోల చోరీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నగరంలో మంగళవారం రాత్రి రెండు ఆటోలు చోరీకి గురయ్యాయి. అంబేడ్కర్ భవన్ రోడ్డులో ఉంటున్న డ్రైవర్లు... తమ వీధుల్లోకి ఆటోలు ప్రవేశించే అవకాశం లేకపోవటంతో ప్రధాన వీధిలో నిలిపి ఉంచారు. బుధవారం ఉదయం అవి మాయమవ్వడంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

చీమకుర్తి, న్యూస్‌టుడే:

?: చీమకుర్తి చర్చి బజారులోని వీధి దీపం గత కొద్ది రోజులుగా వెలగడం లేదు. **- కె.వెంకటేశ్వర్లు, పట్టణవాసి**

✓: వెంటనే మరమ్మతులు చేయిస్తాం. **- గోపి, ఇంజినీరింగ్ పర్యవేక్షకుడు**

?: సూర్యనగర్‌లో కాలువలు శుభ్రం చేయక మురుగు పేరుకుపోయి... దుర్వాసనతో పాటు దోమలు పెరిగి ఇబ్బంది పడుతున్నాం. **- జి.శ్రీనివాసరావు, స్థానికుడు**

✓: ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్య లేకుండా చూస్తాం. **- రామకృష్ణ, కమిషనర్, చీమకుర్తి**

చదువుల తల్లికి వందనం



కొప్పోలులో...



ఒంగోలు రామ్‌నగర్‌లో..



చీమకుర్తి హరిహర క్షేత్రంలో...

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం... ఆయా ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. పలుచోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శ్రీగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తులసి దళాలతో సహస్రనామార్చన, సాయంత్రం హనుమంత వాహనసేవ ఉంటాయని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

- న్యూస్‌టుడే బృందం

క్విస్ విద్యాసంస్థలో దసరా వేడుకలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: క్విస్ విద్యాసంస్థల్లో బుధవారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాల తయారీ, చిత్రలేఖనం, మెహిందీ, నిధి అన్వేషణ తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గీతాలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. కళాశాల అధినేత నిడమానూరి సూర్యకల్యాణచక్రవర్తి, ప్రిన్సిపల్ హనుమంతరావు, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: తపాలా వారోత్సవాల సందర్భంగా ఆ శాఖ ఉద్యోగులు నగరంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కార్యాలయం నుంచి కోలాస్ హోటల్ వరకు ఇది సాగింది. పోస్టు మాస్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వారోత్సవాల నేపథ్యంలో ఒంగోలు, మద్దిపాడు, వల్లపర్లలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆధార్ నమోదు, బీమా పాలసీలు చేయించుకోవచ్చన్నారు. రవికుమార్, రామకృష్ణారెడ్డి, వెంకారెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న తపాలా సిబ్బంది

ప్రయాణం... ప్రాణాపాయం

◆ హైవేపై అడ్డంగా రాకపోకలతో చిక్కులు

ఈనాడు-ఒంగోలు

చెన్నయ్ - కోల్‌కతా పదహారో నంబరు జాతీయ రహదారి... మద్దిపాడు మండలం పరిధిలోని పలు గ్రామాల మధ్యలోంచి వెళ్తుంది. ఈ మార్గం విస్తరణ సమయంలో అవసరమైన చోట అండర్‌పాస్‌లు నిర్మించకపోవడంతో ఆయా ప్రాంతాల్లో ఇప్పుడు సమస్య నెలకొంది. వాహనదారులు రోడ్డు దాటాలంటే రెండు నుంచి మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. అంతదూరం ప్రయాణించడం ఇష్టం లేనివారు... డివైడర్ మీదుగా అడ్డంగా రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని చోట్ల వ్యతిరేకదిశలోనూ వెళ్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు అతి వేగంగా వచ్చే మార్గం కావడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

బ్లాక్‌స్పాట్‌లు గుర్తించినా...

ఏడుగుండ్లపాడు, దొడ్డవరప్పాడు, కొప్పోలు, గుండ్లాపల్లి, వెల్లంపల్లి, గాజులపాలెం, కీర్తిపాడు, వెంకటరాజుపాలెం తదితర ప్రాంతాల్లో సమస్య ఎక్కువగా ఉంది. ముఖ్యంగా వెల్లంపల్లి వద్ద పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు డివైడర్ పైనుంచి అడ్డంగా రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంటోంది. రాత్రి వేళ పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటోంది. ఈ రహదారిపై ఎక్కువ దుర్ఘటనలు చోటుచేసుకుంటున్న ప్రాంతాల్లో... మద్దిపాడు మండలం ఒకటని గతంలోనే గుర్తించారు. వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించి... హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా పరిస్థితిలో మార్పులేదు. సిబ్బందితో నిత్యం పర్యవేక్షిస్తే కొంతైనా మేలు కలుగుతుందని... దీర్ఘకాలంలో సమస్య లేకుండా అండర్‌పాస్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.



వెల్లంపల్లిలో పరిస్థితి ఇది..



దారి మధ్యలో ప్రమాదకరంగా...



వెంకటరాజుపాలెంలో ఇలా...

గ్రానైట్ భూముల పరిశీలన

ఒంగోలు, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం ఆర్‌ఎల్‌పురం పంచాయతీ పరిధి సర్వే నెంబరు 55-4బీలో గ్రానైట్ నిక్షేపాలు ఉన్న భూములను గనుల నిఘా విభాగం, రెవెన్యూ అధికారుల బృందం గత రెండు రోజులుగా పరిశీలన చేసింది. ఇందులోని 39.56 ఎకరాలకు సంబంధించి హక్కుదారుల విషయమై న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. పట్టాభూమిలో కొన్ని సంస్థల వారు గ్రానైట్ వ్యర్థాలు పోస్తున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో ఆయా అధికారులు పరిశీలన చేపట్టారు. భూముల వివరాలను స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి సేకరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 1104 యూనియన్ ఆధ్వర్యంలో ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్, టీఏ బిల్లుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంఘం నాయకులు హరికృష్ణ, రాచగర్ల సంజీవరావు, ప్రతాప్, జాన్సన్, మల్లికార్జున్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్ఈని సన్మానించారు.

శాఖా గ్రంథాలయం సందర్శన

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: గ్రంథాలయాల అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. సంతనూతలపాడులోని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఎక్కువ మంది పాఠకులు వచ్చేలా చూడాలని సూచించారు. గ్రంథపాలకుడు సత్యనారాయణ, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు ప్రయోజనం

మద్దిపాడు, న్యూస్‌టుడే: పెదకొత్తపల్లిలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆర్డీవో లక్ష్మీప్రసన్న బుధవారం తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ సుజన్ కుమార్, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో ఆరిఫా తదితరులు పాల్గొన్నారు.